సాక్షి ప్రకాశం

శనివారం । 29 । జూన్ । 2024



మై క్వీన్ యాప్‌కు బ్రేక్

ఒకటికి ఏడు రెట్లు నగదు ఇస్తామని నమ్మబలికి వేలాది మంది చేత డిపాజిట్లు కట్టించుకున్న మై క్వీన్ యాప్ మూడు రోజులుగా మూతపడింది.

- 8లో..



నీటి పన్ను స్వాహాలో కార్యదర్శే సూత్రధారి

మద్దిపాడు మండలం దొడ్డవరం పంచాయతీలో నీటి పన్ను స్వాహాలో కార్యదర్శే సూత్రధారి అని విచారణలో తేలింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం 38/29

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన బూచేపల్లి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందచేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి

ఒంగోలు అర్బన్: కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తమీమ్ అన్సారియాను శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఆమె కుమారుడు దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డిలు ప్రకాశం భవనంలో మర్యాద పూర్వకంగా కలిశారు. కొత్తగా వచ్చిన కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందచేసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. జిల్లా అభివృద్ధితో పాటు దర్శి నియోజకవర్గ అభివృద్ధి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

సోలార్ టెక్నాలజీలో ఉచిత శిక్షణ

ఒంగోలు టౌన్: పదో తరగతి చదివిన నిరుద్యోగ యువతీ యువకులకు ఒంగోలులోని ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, సోలార్ ప్యానెల్ టెక్నీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జె.రవి తేజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు నిర్వహించే ఈ శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. ఆసక్తి కలిగిన యువతీ యువకులు జులై 4వ తేదీలోపు ప్రభుత్వ ఐటీఐ కాలేజీలోని స్కిల్ హబ్ సెంటర్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. జులై 5 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. పూర్తి వివరాలకు 7989244381కు ఫోన్ ద్వారా సంప్రదించాలని కోరారు.

రేషన్ పంపిణీ సక్రమంగా నిర్వహించాలి

- ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ



ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: రేషన్ కార్డుదారులకు సరఫరా చేసే రేషన్ సరుకులు పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సక్రమంగా నిర్వహించాలని, సరఫరా చేసే బియ్యం, నూనె, కందిపప్పు వంటివి నాణ్యతతో పాటు కచ్చితమైన తూకంతో అందచేయాలని జాయింట్ ఆర్ గోపాలకృష్ణ స్పష్టం చేశారు. శుక్రవారం చీమకుర్తిలోని ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను పరిశీలించారు. రేషన్ సరుకుల నాణ్యతతో పాటు వారి పరిమాణాన్ని నిబంధనల ప్రకారం ఉందో లేదో పరిశీలించారు. రేషన్ సరుకుల నిల్వకు సంబంధించిన రికార్డులను సైతం పరిశీలించి పక్కాగా రికార్డుల నిర్వహణ ఉండాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్‌తో పాటు పౌరసరఫరాల అధికారులు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

పొగాకు ధర గరిష్టంగా రూ.360



పొదిలి వేలం కేంద్రంలో వేలానికి వచ్చిన పొగాకు బేళ్లు

ఒంగోలు సెంట్రల్: రీజియన్ పరిధిలో పొగాకు వేలం ధర శుక్రవారం గరిష్టంగా కేజీ రూ.360 పలికిందని ఆర్‌ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలో 6847 బేళ్లు రాగా, 6359 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 488 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలు, కొండపి కేంద్రాల్లో 92వ రోజు వేలం పాటలో 3986 బేళ్లు రాగా 3759 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 227 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో కేజీ గరిష్టంగా రూ.359, కనిష్టంగా రూ.205, సరాసరి రూ.251.90 వచ్చింది. డీసీపల్లి, కలిగిరి, కందుకూరు-2, వెల్లంపల్లి, పొదిలి, కనిగిరి తదితర కేంద్రాల్లో 87వ రోజు వేలం పాటలో 2861 బేళ్లు రాగా, 2600 బేళ్లు కొనుగోలయ్యాయి. 261 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో గరిష్టంగా రూ.360, కనిష్టంగా రూ.204, సరాసరి రూ.223.94 వచ్చింది.



ఒంగోలులో వృద్ధురాలికి పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

సామాజిక పింఛన్ల పంపిణీలో కీలకమైన వలంటీర్లను కూటమి ప్రభుత్వం ఆ విధుల నుంచి తప్పించింది. సచివాలయ ఉద్యోగుల ద్వారానే ఈ నెల పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించడంతో పాటు వలంటీర్లను సచివాలయాలకు కూడా రావద్దని సచివాలయ సిబ్బంది చేత చెప్పిస్తున్నారు. వారి వద్ద సెల్‌ఫోన్, బయోమెట్రిక్ పరికరాలనూ స్వాధీనం చేసుకున్నారు. దీంతో వలంటీర్ల వ్యవస్థపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. వలంటీర్ల జీతం పెంచడం దేవుడెరుగు అసలా వ్యవస్థను కొనసాగిస్తారో లేదోనన్న చర్చ సాగుతోంది.

వలంటీర్లు లేకుండానే పింఛన్లు

- ఎన్నికలకు ముందు వలంటీర్లకు రూ.10 వేల గౌరవ వేతనం ఇస్తామంటూ హామీ
- నేడు వలంటీర్లను పక్కన పెట్టేసి పింఛన్ల పంపిణీ
- సచివాలయ ఉద్యోగుల ద్వారానే పింఛన్ల పంపిణీకి రంగం సిద్ధం
- అవసరమైతే ఇతర శాఖలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగుల చేత పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశాలు
- ఏప్రిల్ నుంచి పెంచిన పింఛన్లు ఇస్తామన్న కూటమి
- 11 కేటగిరీలకే పెంచిన పింఛన్లు పంపిణీ
- దివ్యాంగులకు కూడా మూడు నెలల బకాయిలు లేవు

ఒంగోలు టౌన్:

మళ్లీ ఒకటో తేదీ వచ్చింది. గత ఐదేళ్లుగా ఒకటో తేదీ రాగానే తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీ జరిగేది. సచివాలయ వలంటీర్లు ప్రతి ఇంటికీ వచ్చి తలుపు తట్టిమరీ పింఛన్లు ఇచ్చి వెళ్లేవారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి పింఛన్ల పంపిణీ గాడి తప్పింది. వలంటీర్లను పింఛన్లు పంపిణీ చేయకుండా అడ్డుకోవడంతో అవ్వాతాతలు అనేక ఇబ్బందులు పడ్డారు. అసలు పింఛన్లు ఇస్తారో లేదో అని భయాందోళనకు గురైన కొందరు వృద్ధులు, ఎండల్లో బ్యాంకుల చుట్టూ తిరగలేక అలసిపోయిన కొందరు పింఛన్‌దారులు మానసిక ఒత్తిడికి గురై ప్రాణాలు వదిలారు. ఏప్రిల్ నెలలో సచివాలయాల వద్ద పింఛన్లు పంపిణీ చేయగా మే, జూన్ నెలల్లో బ్యాంకుల్లో జమ చేయడంతో వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు అనేక అగచాట్లు పడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్ల ద్వారానే ఇంటి వద్ద పింఛన్లు అందజేస్తామని కూటమి నాయకులు హామీలు ఇచ్చారు. వలంటీర్లను ఎవరినీ తొలగించబోమని, వారిని కొనసాగిస్తామని, గౌరవ వేతనం రూ.10 వేలు ఇస్తామని చెప్పారు. తీరా ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత పాతిక రోజుల నుంచి వలంటీర్లను పక్కన పెట్టేశారు.

ఎదురుచూపుల్లో వలంటీర్లు...

2019 ఆగస్టు 15వ తేదీ అప్పటి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను, ప్రతి 2 వేల ఇళ్లకు ఒక గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. జిల్లాలో 719 సచివాలయాలు ఉండగా ఒంగోలు నగరంలో 70 సచివాలయాలు ఉన్నాయి. మొత్తం 12,405 మంది వలంటీర్లు ప్రజలకు అవసరమైన సేవలను అందించేవారు. ఇటీవల ఎన్నికల సమయంలో వివిధ కారణాలతో 5,834 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ప్రస్తుతం 6571 మంది కొనసాగుతున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలతో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి వారు విధులకు దూరంగా ఉంటున్నారు. జూన్ 4న కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయినప్పటికీ వారిని దూరంగా పెడుతున్నారు. ఇప్పుడు వలంటీర్లను సచివాలయాలకు కూడా రావద్దని సచివాలయ సిబ్బంది చేత చెప్పిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే వలంటీర్లు తమకు ప్రభుత్వం ఇచ్చిన మొబైల్ ఫోన్లు, సిమ్, బయోమెట్రిక్ పరికరాన్ని ఎంపీడీఓ కార్యాలయంలో అప్పగించారు. ఇప్పుడు పింఛన్ల పంపిణీకి కూడా వారిని దూరంగా పెడుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తారో లేదో అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వలంటీరు వ్యవస్థను మంగళం పాడే ఉద్దేశంతోనే కీలకమైన పింఛన్ల పంపిణీకి వారిని దూరంగా పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది.

పింఛన్ల పంపిణీ ఇలా..

కూటమి ప్రభుత్వం ఇప్పుడు గ్రామ సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్లు పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకుంది. జిల్లాలో ఉన్న 719 గ్రామ సచివాలయాల్లో 6,162 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కో సచివాలయంలో గ్రామీణ ప్రాంతంలో 11 మంది సిబ్బంది ఉండగా అర్బన్ ప్రాంతాల్లో 10 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ఒక్కొక్కరికి 50 ఇళ్ల చొప్పున కేటాయించారు. అవసరమైతే అదనంగా ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందిని ఇందుకోసం కేటాయించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, డీఆర్డీఏ, డీపీవో అధికారులతో కలెక్టర్ తమీమ్ అన్సారీ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి తగిన సూచనలు జారీ చేశారు.

ఆతృతగా ఎదురుచూస్తున్న అవ్వాతాతలు

జిల్లాలో 2,92,999 మంది పింఛన్‌దారులు ఉన్నారు. ఇప్పటి వరకు వీరికి ప్రతి నెలా రూ.3 వేల పింఛన్ ఇచ్చేవారు. అయితే ప్రస్తుత కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.3 వేల పింఛన్‌ను రూ.4 వేలకు పెంచుతున్నట్లు ప్రకటించింది. దీంతో పాటు ఏప్రిల్ నుంచి జూన్ వరకు నెలకు రూ.1000 చొప్పున బకాయిలు ఇస్తామని చెప్పింది. అంటే ఒక్కొక్క లబ్ధిదారుకు ఈ నెలలో రూ.7 వేల పింఛన్ అందజేయాల్సి ఉంటుంది. ఈ మేరకు జూలై నెల పింఛన్ రూ.124,64,75 తో పాటుగా ఏప్రిల్, మే, జూన్ మూడు నెలలకు బకాయిలు రూ.75,46,29,000 కలిపి మొత్తం రూ.200.11 కోట్లకు పైగా పంపిణీ చేయాల్సి ఉంది. పెంచిన బకాయిలు అందరికీ వస్తాయని లబ్ధిదారులు ఆశలు పెట్టుకున్నారు. కానీ ప్రభుత్వం ఇప్పుడు ఇచ్చిన ఆదేశాల ప్రకారం కేవలం 11 కేటగిరీలకు చెందిన వారికి మాత్రమే పెంచిన వేయి రూపాయల తాలుకు బకాయిలు ఏప్రిల్ నుంచి చెల్లించనున్నారు. మిగతా వారికి జూలై పింఛన్లు మాత్రమే ఇవ్వనున్నారు.

విద్యుత్ శాఖకు బకాయిల బండ



మార్కాపురం మున్సిపాలిటీ కార్యాలయం

మార్కాపురం విద్యుత్ సబ్‌డివిజన్‌లో బకాయిలు ఇలా

మార్కాపురం మున్సిపాలిటీ:	రూ.3,22,96,851
పెద్దదోర్నాల మేజర్ పంచాయతీ:	రూ.10,40,69,409
విద్యాశాఖ:	రూ.45,65,358
అటవీ శాఖ:	రూ.1,27,422
మెడికల్ శాఖ:	రూ.49,00,947
తహశీల్దార్ కార్యాలయాలు:	రూ.20,12,276
ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాలు :	రూ.13,38,396
సాంఘిక సంక్షేమ శాఖలు :	రూ.8,27,117
ఆర్‌అండ్‌బీ శాఖలు :	రూ.2,75,987
తర్లుపాడు ప్రభుత్వ కార్యాలయాలు :	రూ.2,75,57,848
పెద్దారవీడు మండల కార్యాలయాలు:	రూ.6,73,29,799
మార్కాపురం మండల కార్యాలయాలు:	రూ.3,26,52,241

- ప్రభుత్వ కార్యాలయాల్లో పేరుకుపోతున్న విద్యుత్ బకాయిలు
- మార్కాపురం సబ్‌డివిజన్‌లో విద్యుత్ బకాయిల మొత్తం రూ.28.27 కోట్లు

మార్కాపురం: విద్యుత్‌శాఖకు చెల్లించాల్సిన బకాయిలను ప్రభుత్వ కార్యాలయాల అధిపతులు సకాలంలో చెల్లించకపోవడంతో విద్యుత్ బకాయిలు పేరుకుపోతున్నాయి. మార్కాపురం విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలో మార్కాపురం పట్టణ, రూరల్, తర్లుపాడు, పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఎంపీడీఓ, తహశీల్దార్, ఆర్‌అండ్‌బీ, సాంఘిక సంక్షేమశాఖ, మున్సిపల్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి బకాయిలు మొత్తం రూ.28.27 కోట్లు ఉన్నాయి. ప్రభుత్వం ఆయా శాఖలకు విద్యుత్ బిల్లులు ఇస్తున్నా కార్యాలయ అధికారులు సకాలంలో విద్యుత్‌శాఖకు చెల్లించకపోవడంతో ప్రతినెలా బకాయిలు పెరిగి పోతున్నాయి. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు బకాయిల వసూళ్ల కోసం ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నారు. ప్రధానంగా ప్రభుత్వ శాఖల కార్యాలయాల బకాయిలే మార్కాపురం సబ్‌డివిజన్‌లో ఎక్కువగా ఉండటం గమనార్హం. విద్యుత్ అధికారులు కూడా తోటి ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులే కావడంతో చూసి చూడనట్లు పోతున్నారు. విద్యుత్‌కట్ చేస్తే అక్కడ పనిచేసే సిబ్బందితోపాటు ఆ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు కూడా ఇబ్బంది పడతారనే మానవతా దృక్పథంతో ఆలోచిస్తున్నారు.

వీటితోపాటు ఇంకా మార్కాపురం పట్టణంలో ప్రైవేటు విద్యా సంస్థలు, ఫ్యాక్టరీలు, గృహాలు, వ్యవసాయ విద్యుత్ బకాయిలు కూడా పేరుకుపోయి ఉన్నాయి. వీటి వసూళ్ల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు మార్కాపురం విద్యుత్‌శాఖ ఏడీఈ షియానాయక్ తెలిపారు.

డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలి



స్టాప్ డయేరియా కార్యక్రమంపై సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: డయేరియా పట్ల ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని దాని బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. శుక్రవారం ప్రకాశం భవనంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ స్టాప్ డయేరియా క్యాంపెయిన్ 2024 కార్యక్రమం పక్కాగా నిర్వహించాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. అటువంటి నీరు తాగడం వలన అతిసార, డయేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున వైద్య ఆరోగ్య శాఖ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాధుల లక్షణాలపై ప్రజలు అవగాహన కల్పించి ముందస్తు వైద్య సేవలు తీసుకునేలా చూడాలన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులను జాగ్రత్తగా చూసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించాలన్నారు. ఆశా, ఏఎన్ఎంల ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇంటింటికీ అందచేయాలన్నారు. దీనిలో డీఎంహెచ్ఓ సురేష్‌కుమార్, డీసీహెచ్‌ఎస్ మూర్తి, డీఈఓ సుభద్ర, ఐసీడీఎస్ పీడీ మాధురి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, డాక్టర్ బాలాజీనాయక్, ఉషారాణి ఇతర అధికారులు పాల్గొన్నారు.

జవాబుదారీతనంతో పనిచేయండి





కలెక్టర్ తమీమ్ అన్సారియా, పాల్గొన్న జిల్లా అధికారులు

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారంలో జవాబుదారీతనంతో పనిచేయాలని, నిజాయితీతో, బాధ్యతతో విధులు నిర్వహించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులకు సూచించారు. శుక్రవారం స్పందన భవనంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులను పరిచయం చేసుకుంటూ ఆయా శాఖల్లో అమలవుతున్న జిల్లాలోని ప్రాధాన్యత అంశాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందాలన్నారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు లక్ష్యాలు సాధించేలా కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో క్షేత్ర స్థాయిలో సమస్యలను పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ప్రజల సంతృప్తి స్థాయిని పెంచేలా అధికారుల పనితీరు ఉండాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ విశ్వేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పురుగుమందులతోనే పట్టు పంట దెబ్బ

- జూలై నుంచి గిద్దలూరులోని ప్రభుత్వ చాకి కేంద్రం పునరుద్ధరణ
- జిల్లా పట్టు పరిశ్రమ శాఖాధికారి డాక్టర్ పీ సుజయ్ కుమార్

ఒంగోలు సెంట్రల్: పట్టుపరిశ్రమ శాఖ అనుమతించని పురుగు మందులను రైతులు విరివిగా వాడటం వలన మల్బరీ ఆకు విషపూరితమై పట్టు పంటలు దెబ్బతిన్నట్లు జిల్లా పట్టు పరిశ్రమ శాఖాధికారి డాక్టర్ పీ సుజయ్ కుమార్ వివరణ ఇచ్చారు. 'సాక్షి' దిన పత్రికలో శుక్రవారం 'పట్టు తప్పుతోంది' శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా పట్టుపరిశ్రమ శాఖాధికారి వివరణ ఇస్తూ జిల్లాలో 1578 ఎకరాల్లో మల్బరీ సాగు ఉందని చెప్పారు. పట్టుగుడ్లను బెంగళూరు, మైసూర్‌లలోని సెంట్రల్ సిల్క్ బోర్డు నుంచి రైతులకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

జిల్లాలోని ప్రైవేట్ చాకి కేంద్రం మూతపడినందున పట్టు రైతులు పక్క జిల్లాలోని, కర్ణాటక రాష్ట్రంలోని ప్రైవేట్ చాకి కేంద్రాల నుంచి అధిక ధరలకు పట్టుపురుగులు తెస్తున్నారని చెప్పారు. దూరం నుంచి తేవటం వలన పట్టుపురుగులు దెబ్బతిని పంట నష్టం జరుగుతోందన్నారు. గిద్దలూరులోని ప్రభుత్వ చాకి కేంద్రం పునరుద్ధరణకు వచ్చే నెల నుంచి అనుమతి వచ్చినట్లు వెల్లడించారు. తమ శాఖ వారే ఇతర రాష్ట్రాల నుంచి పట్టుపురుగులను తెచ్చి ప్రభుత్వ చాకి కేంద్రం ద్వారా సరఫరా చేస్తామని తెలిపారు. పురుగు మందులు సైతం మైసూర్ సెరీకల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రతిపాదించిన మందులను మాత్రమే వాడేలా రైతులకు శిక్షణ ఇచ్చి అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని అందువలన ఈ సంవత్సరం దిగుబడి 73.5 కేజీలు పెరిగిందని తెలిపారు. పట్టుగుడ్ల సరాసరి ధర గత సంవత్సరం రూ.458 ఉండగా, ప్రస్తుతం రూ.465 ఉందన్నారు. తీవ్ర నీటి ఎద్దడి, కూలీల కొరత, అధిక కూలీ ఖర్చులు, అధిక పెట్టుబడి తదితర అంశాలు రైతులకు ఇతర వాణిజ్య పంటల వైపు ఆకర్షిస్తున్నందున జిల్లాలో మల్బరీ సాగు తగ్గుముఖం పట్టిందని చెప్పారు. ఉన్న కొద్ది మంది సిబ్బందితో క్లస్టర్ విధానంలో పనిచేస్తూ పట్టు రైతులకు అందుబాటులో ఉండి కావాల్సిన అన్ని సాంకేతిక సలహాలు ఇస్తున్నామన్నారు.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

ఒంగోలు సిటీ: ఒంగోలులోని పాత జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరం (సౌత్‌బైపాస్ రోడ్డు)లో 29 వ తేదీ శనివారం ఉదయం 10.30 గంటలకు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ కె.మాధురి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో వ్యవసాయ, సంబంధిత శాఖల కార్యకలాపాలపై సమీక్ష, విద్యాశాఖ, డీఆర్‌డీఏ, గృహ నిర్మాణశాఖ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ, సాంఘిక సంక్షేమశాఖ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు సెంట్రల్: కారాగార సంస్కరణలు, చట్టపరమైన హక్కులు, కౌన్సిలింగ్, వయోజన విద్య మొదలైన సేవల్లో పేరు పొంది సామాజిక సేవకులతో కలిసి పనిచేసే సిబ్బంది ఎంపికకు ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ గోపాలకృష్ణ రోణంకి తెలిపారు. జిల్లాలో ఆసక్తి, అనుభవం ఉన్న వారు ఎవరైనా ఉంటే తమ విద్యార్హతలతో వారం రోజుల్లో కలెక్టర్‌కు ప్రతిపాదనలు సమర్పించాలని చెప్పారు. కమిటీ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

పీజీ సెట్‌లో ప్రకాశం యువతికి రెండో ర్యాంకు

నాగులుప్పలపాడు: పీజీ సెట్‌లో జిల్లా యువతికి రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు దక్కింది. నాగులుప్పలపాడు మండలంలోని ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన పుల్లా బ్లెస్సీ జాయ్ కర్ణాటకలోని మైసూర్‌లో బీఈడీ పూర్తి చేసి పీజీ చేయడానికి ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన పీజీ సెట్‌లో ఎంఏ ఇంగ్లిష్ పరీక్ష రాసింది. 89/100 మార్కులతో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించింది. ఆమె తల్లి సుచరిత బాపట్ల జిల్లా చినగంజాం మండలం పెదగంజాం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. తండ్రి ముత్యాలయ్య ఓ ప్రైవేటు కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. తల్లిదండ్రులతో పాటు పలువురు గ్రామస్తులు బ్లెస్సీ జాయ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

నీళ్ల కోసం రోడ్డెక్కారు



పెద్దదోర్నాలలో నీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని గాంధీ బజార్‌కు చెందిన పలువురు మహిళలు నీళ్ల కోసం రోడ్డెక్కారు. తమ వీధికి నీటి సరఫరా కావడం లేదని వారు ఖాళీ బిందెలతో నటరాజ్ సెంటర్‌లో బైఠాయించారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి వారికి నచ్చజెప్పటంతో ఆందోళన విరమించి పంచాయతీ కార్యాలయానికి చేరుకుని పంచాయతీ కార్యదర్శి మోహనరావుతో మాట్లాడారు. గాంధీ బజారుకు ట్యాంకర్లను పంపిస్తామని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు. కొత్తగా వచ్చిన ట్యాంకర్ల మ్యాపింగ్ ప్రక్రియ తొందరగా పూర్తి చేసి నీటి ఇబ్బందుల తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు విన్నవిస్తున్న కాలేషా

ఒంగోలు సెంట్రల్: దివ్యాంగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాను నవ్యాంధ్ర వికలాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా కోరారు. శనివారం కలెక్టర్‌ను కలిసి అభినందనలు తెలిపిన అనంతరం పలు సమస్యలు విన్నవించారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు బాణావతే వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు నజీర్ బాషా, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి సీఐ సస్పెన్షన్

చీమకుర్తి: చీమకుర్తి సీఐ దుర్గాప్రసాద్‌ను ఐజీ సస్పెండ్ చేసినట్లు ఒంగోలు డీఎస్పీ ఎం.కిషోర్‌బాబు తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం కారణంగా సస్పెండ్ చేసినట్లు చెప్పారు.

ట్రావెల్స్ బస్సులో మంటలు

● త్రుటిలో తప్పిన ప్రమాదం



అగ్నిప్రమాదానికి గురైన ట్రావెల్ బస్సు

కురిచేడు: ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో అకస్మాత్తుగా మంటలు వ్యాపించిన ఘటన కురిచేడు సమీపంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. శివసూర్య టూర్స్ అండ్ ట్రావెల్స్ బస్సు హైదరాబాద్ నుంచి పామూరుకు సుమారు 40 మంది ప్రయాణికులతో వెళ్తోంది. కురిచేడు గ్రామ సమీపంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం వరకు వచ్చేసరికి షార్ట్ సర్క్యూట్ అయి బస్సులో మంటలు చెలరేగాయి. గమనించిన ప్రయాణికులు వెంటనే డ్రైవర్‌ను అప్రమత్తం చేయడంతో బస్సును పక్కకు ఆపి ప్రయాణికులను బస్సులో నుంచి దింపి మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించకపోవడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

చెక్‌పోస్ట్ ఉద్యోగిపై దాడి కేసు.. నిందితుడికి నాలుగేళ్ల జైలు

మార్కాపురం: పెద్దారవీడు మండలం కొర్రపోలు చెక్‌పోస్టు వద్ద విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై మద్యం సేవించి దాడి చేసిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి నాలుగేళ్ల జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ మార్కాపురం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి బి.దేవేందర్‌రెడ్డి తీర్పు వెల్లడించారు. 2017 నవంబరు 7న పెద్దారవీడు మండలం కొర్రపోలు చెక్‌పోస్టు వద్ద షేక్ ఖాజామొహిద్దీన్, చక్రాల కోటిలింగం, అమిరెడ్డి రామిరెడ్డి విధి నిర్వహణలో ఉన్నారు. తుమ్మలబైలుకు చెందిన భూమని వెంకటేశం మద్యం సేవించి చెక్‌పోస్టు దగ్గరికి వచ్చి సిబ్బందితో గొడవపడ్డాడు. చెక్‌పోస్టులో ఉన్న సీసీ కెమెరాలు, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశాడు. కోటిలింగాన్ని గొడ్డలితో గాయపరచడంతో ఆయన దోర్నాల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై రామకోటయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో నాలుగేళ్ల జైలు శిక్ష, 1000 రూపాయలు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ గాంధీరెడ్డి వాదించారు. కోర్టు లైజన్ ఆఫీసర్లు ఎస్కే మునాఫ్, ఐవీ శ్రీనివాసరావు, పీవీ సురేష్‌కుమార్ తదితరులు కోర్టు సిబ్బందికి సహకరించారు.

పొదిలి ఎస్సైకి రెండు రివార్డులు



ఎస్పీ నుంచి ప్రశంస పత్రం అందుకుంటున్న ఎస్సై కోటయ్య

పొదిలి: విధి నిర్వహణలో ప్రతిభ చూపిన పొదిలి ఎస్సై కోటయ్య ఒకేసారి రెండు రివార్డులు అందుకున్నారు. శుక్రవారం ఒంగోలులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ రివార్డులు, ప్రశంస పత్రాలు అందజేశారు. సార్వత్రిక ఎన్నికల వేళ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూడటం, 2017లో అర్ధవీడు మండలం పాపినేనిపల్లిలో పనిచేస్తున్న సమయంలో జరిగిన హత్య కేసు నిందితుడికి జీవిత ఖైదు పడేలా దర్యాప్తు చేపట్టినందుకుగాను రివార్డులు అందించారు. విధి నిర్వహణలో ఎస్సై కోటయ్య స్థానిక ప్రజల అభిమానం సంపాదించారని పలువురు అభినందనలు తెలిపారు. పోలీసు ఉన్నతాధికారులు, పోలీసులు, సిబ్బంది ప్రశంసించారు.

నీటి పన్ను స్వాహాలో

కార్యదర్శే సూత్రధారి

● దొడ్డవరంలో నీటి పన్నుల నగదు గోల్‌మాల్‌పై ఉన్నతాధికారులకు ఈఓపీఆర్‌డీ నివేదిక

● మామూళ్లు అందించిన వారిపై చర్యలు తీసుకోని మాజీ ఎంపీడీఓ



కార్యదర్శులను విచారిస్తున్న ఈవోపీఆర్డీ(ఫైల్)

మద్దిపాడు: మండలంలోని దొడ్డవరం పంచాయతీలో లక్షల రూపాయల నీటి పన్నుల నగదు గోల్‌మాల్ వ్యవహారంలో అప్పటి గ్రామ కార్యదర్శి షేక్ జానీబాషానే సూత్రధారి అని విచారణలో తేలింది. అప్పటి ఎంపీడీఓ కూడా మామూళ్లు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోకుండా వారి అక్రమాలకు అండగా నిలిచి పంచాయతీ పన్నుల నగదును ఇష్టానుసారంగా వాడుకున్నప్పటికీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు వెల్లడైంది. అసలు ఉన్నతాధికారులకు తెలియకుండా పబ్లిక్ వాటర్ స్కీమ్‌ను పంచాయతీ స్వాధీనపరచుకోవడం, అదే ఉన్నతాధికారులకు తెలియకుండా సర్పంచ్, అప్పటి గ్రామ కార్యదర్శి షేక్ జానీబాషాలు పబ్లిక్ వాటర్ స్కీమ్ పేరిట బ్యాంకులో జాయింట్ ఖాతా తెరవడం, వసూలైన నిధులు పూర్తిగా మింగేయడం సంచలనం సృష్టించింది. ఈఓపీఆర్‌డీ రఘుబాబు విచారణలో పలు విషయాలు వెల్లడైనట్లు తెలిసింది. ముఖ్యంగా 2021 జూన్ నుంచి 2023 జూన్ వరకూ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన జానీబాషాపై గ్రామస్తులు పలు ఆరోపణలు చేశారు. ఇంటి పన్ను వసూలు చేసి పంచాయతీకి జమ చేయకుండా కాజేశాడని, తమ వద్ద ఉన్న ఇంటిపన్ను రసీదులు పరిశీలిస్తే ఆ విషయం తెలుస్తుందని వారు ఆరోపించారు. వాటర్ స్కీమ్ కింద 1350 కనెక్షన్లు ఉండగా, నెలకు రూ.150 చొప్పున నెలకు సుమారుగా రెండు లక్షల రూపాయల వరకూ వసూలయ్యే పరిస్థితి ఉన్నా.. విద్యుత్ బకాయిలు చెల్లించకపోవడం ఏమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. కాగా, జానీబాషా హయాంలో రూ.26 లక్షలు వసూలు చేశారు. అందులో రూ.11 లక్షలు ప్రైవేటు ఖాతాలో జమ చేశారు. జీపీ ఖాతాలో రూ.90 వేలు జమ చేశారు. మిగిలిన రూ.14 లక్షలు గోల్‌మాల్ జరిగింది. ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా 14వ వార్డు మెంబర్ వెంకట్రావు భార్యను నీటి పన్ను వసూలు చేయడానికి నియమించుకోవడం, వారు వసూలు చేసిన డబ్బులో నెలకు రూ.12 వేలు తీసుకుని మిగిలిన డబ్బు కార్యదర్శికిగానీ సర్పంచ్‌కుగానీ ఇస్తున్నామనడం చేస్తూ వచ్చారు. రూ.2 లక్షల వరకూ లెక్కచెప్పలేదని సర్పంచ్ ఆరోపించగా, సదరు వెంకట్రావు ఒక పెద్ద లిస్టునే ఈఓపీఆర్‌డీకి సమర్పించారు. అందులో మాజీ ఎంపీడీఓ శ్రీనివాసరావుకు చేపలు కొనడానికి రూ.600 ఖర్చు చేసినట్లు, ఎంపీడీఓకు కరివేపాకు తోటలో పార్టీ ఇవ్వడానికి రూ.7 వేలు ఖర్చయినట్లు, కనుమ పండుగ రోజు రూ.10 వేలతో పార్టీ ఇచ్చినట్లు, పోర్క్ మాంసంకు రూ.700 ఖర్చు చేసినట్లు, ఇంకా పలు సందర్భాలలో చేసిన ఖర్చుల లిస్టు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆ లిస్టులో ఖర్చుచేసిన నగదు మొత్తం రూ.2 లక్షలకుపైగానే ఉందని వెంకట్రావు తెలిపినట్లు సమాచారం. ఇదిలా నడుస్తుండగా.. కార్యదర్శి జానీబాషా విచారణ జరుగుతున్న సమయంలో పారిశుధ్య కార్మికులకు ఇవ్వాల్సిన జీతం బకాయిలిచ్చి వారిచే సంతకాలు తీసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై గ్రామస్తులు నిలదీయడంతో ఒకరిద్దరి వద్ద సంతకాలు తీసుకోకుండానే వెళ్లిపోయినట్లు చెప్పారు. ఈ మొత్తం వ్యవహారంపై జరిగిన విచారణ నివేదికను ఉన్నతాధికారులకు ఈవోపీఆర్‌డీ అందజేసిన నేపథ్యంలో బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

'మై క్వీన్' యాప్‌కు బ్రేక్

● పశ్చిమ ప్రకాశంలో వేల మంది బాధితులు

● డబ్బు తిరిగి తీసుకునే మార్గం లేక, మోసపోయామని ఆందోళన



మార్కాపురం:

చెన్నై, హైదరాబాద్ కేంద్రాలుగా చేసుకుని రూపాయి పెట్టుబడి పెడితే ఏడు రూపాయలు వస్తాయని ఆశ చూపించి ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమైన ‘మై క్వీన్’ యాప్ సేవలు మూడు రోజులుగా నిలిచిపోయాయి. దీంతో ఈ యాప్‌లో పెట్టుబడి పెట్టినవారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 26వ తేదీన ‘ముంచేసిన మై క్వీన్’ పేరుతో ‘సాక్షి’ మెయిన్ పేజీలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పోలీసులు వివరాలు సేకరించడం ప్రారంభించారు. ఈ విషయం తెలిసి చెన్నై, హైదరాబాద్‌లో ఉన్న యాప్ నిర్వాహకులు అప్రమత్తమయ్యారు. వెంటనే యాప్‌ను డౌన్ చేయడంతో బుధవారం నుంచి లావాదేవీలు నిలిచిపోయాయి. ప్రకాశం జిల్లా మార్కాపురం, గిద్దలూరు, కంభం, యర్రగొండపాలెంతోపాటు పలు ప్రాంతాల్లో వేలాది మంది మై క్వీన్ యాప్‌లో కోట్ల రూపాయలు కట్టినట్లు సమాచారం. మార్కాపురం పట్టణంలోనే ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, రోజువారీ కూలీలు, హోటల్ నిర్వాహకులు, పూలు, పండ్ల వ్యాపారులు సుమారు 5 వేల మంది మైక్వీన్ యాప్‌లో పెట్టుబడులు పెట్టినట్లు అంచనా. తొలుత సుమారు 21 రోజులకు పెట్టిన పెట్టుబడులు తిరిగి రావడంతో యాప్‌ను నమ్మి ఒక్కొక్కరు రూ.5వేలు నుంచి రూ.10వేల వరకు కట్టారు. మార్కాపురంలోని ఓ సచివాలయంలో పనిచేసే ఉద్యోగి సుమారు రూ.లక్ష కట్టినట్టు తెలుస్తోంది. మరోవైపు ‘సాక్షి’లో వార్త ప్రచురించిన తర్వాత అప్రమత్తమైన కొందరు వెంటనే తమ డబ్బులను వెనక్కి తీసుకున్నారు. ఇప్పుడు డబ్బులు వెనక్కి తీసుకునేందుకు కూడా యాప్ పనిచేయడం లేదని డబ్బులు కట్టినవారు ఆందోళనకు గురవుతున్నారు.

రైతులకు ప్రోత్సాహక బహుమతులు



వెండి జ్ఞాపికలు అందుకున్న రైతులు

ఒంగోలు సెంట్రల్: 2023–24 రబీ సీజన్‌లో కోరమాండల్ ఇంటర్నేషనల్ నిర్వహించిన రైతు సంబరాలలో భాగంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు లాటరీ పద్ధతిలో ప్రోత్సాహక బహుమతులు అందించారు. స్థానిక జేడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రోమోర్ ఎరువులు కొనుగోలు చేసిన జిల్లాకు చెందిన ఐదుగురు రైతులు కార్తీక్, కోటిరెడ్డి, రమణారెడ్డి, కాశయ్య, గోపాల్‌రెడ్డిలకు ఒక్కొక్కరికి 50 గ్రాముల వెండి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో జేడీఏ ఎస్.శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ జిల్లా అధికారి హరికృష్ణ, కోరమాండల్ సీనియర్ మేనేజర్ విజయకుమార్, రైతులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సింగరాయకొండ: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియెట్ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.రమాదేవి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం కళాశాలలో సీఈసీ విభాగంలో 80 సీట్లు, ఎంపీసీ 40 సీట్లు, బైపీసీలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. విద్యార్థులు జూలై ఒకటో తేదీ సాయంత్రం 5 గంటల్లోపు గురుకుల పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలని స్పష్టం చేశారు. జూలై 5వ తేదీన 10వ తరగతిలో విద్యార్థినులు సాధించిన మార్కుల ఆధారంగా తయారు చేసిన మెరిట్ లిస్ట్ ప్రకారం స్పాట్ అడ్మిషన్లు చేపడతామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్సీ వర్గీకరణపై చంద్రబాబు తీరు సరికాదు



మాట్లాడుతున్న మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పాలు

బేస్తవారిపేట: ఏపీ సీఎం చంద్రబాబునాయుడు కుప్పం పర్యటనలో జిల్లాల వారీగా ఎస్సీలను ఏబీసీడీ వర్గీకరణ చేస్తానని చెప్పడం ఎంత మాత్రం సరికాదని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్ముతోటి పాలు అన్నారు. స్థానిక మాలమహానాడు కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 27 సంవత్సరాలుగా సుప్రీంకోర్టులో వర్గీకరణ పక్కన పెట్టిన అంశంగా ఉందన్నారు. రాష్ట్రంలో మాలమాదిగలు అన్నదమ్ములుగా కలిసి ఉన్నవారిని విడదీసే ప్రక్రియ చేపట్టవద్దన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మాలలు అంతా ఏకమై భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల వద్ద శాంతియుత ధర్నాలు, మెమోలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా నాయకులు మంచా సాయి, కనమాల కోటి, పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు జంగా కృష్ణ, వినుకొండ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కారంపూడి మైనర్‌బాబు, కందుకూరి జార్జి పాల్గొన్నారు.

ట్రక్ ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన ఖాసిం



దెబ్బతిన్న ద్విచక్రవాహనం

కంభం: ద్విచక్రవాహనాన్ని వెనుక వైపు నుంచి వేగంగా వస్తున్న ట్రక్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి కంభంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక అర్బన్ కాలనీకి చెందిన దూదేకుల ఖాసిం(42) రైల్వే గేటు సమీపంలో ఫ్లయ్‌ఓవర్ అవతలి వైపు నుంచి వస్తున్నాడు. మార్కాపురం వైపు నుంచి వస్తున్న ఓ ట్రక్ వెనుక నుంచి ఖాసింను ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది ధ్రువీకరించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి, ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. మృతి చెందిన వ్యక్తి విశ్వాస్ టీవీలో రిపోర్టర్‌గా పని చేస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈవీఎం గోదామును పరిశీలించిన కలెక్టర్



ఈవీఎం గోదాములో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎం గోదామును నూతన కలెక్టర్ తమీమ్ అన్సారియా శుక్రవారం పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచిన తీరు, భద్రతా చర్యలు, తలుపులకు వేసిన సీళ్లను పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ఈవీఎం గోదాము నిర్వహణ రికార్డులను తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ విశ్వేశ్వరరావు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఇతర అధికారులు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

ఎంఎల్‌ఎస్ పాయింట్ తనిఖీ



ఎంఎల్‌ఎస్ గోడౌన్‌లో సరుకులను తనిఖీ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ఒంగోలు అర్బన్: రేషన్ షాపులకు రేషన్ సరుకులు పంపిణీ చేసే ఒంగోలు ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను పౌరసరఫరాల ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది శుక్రవారం తనిఖీ చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీ చేసి డీలర్లకు సరఫరా చేసే సరుకులకు కచ్చితమైన తూకం వేస్తున్నారా.. లేదా..? అనే అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి డీలర్లకు సరుకులు సకాలంలో సరఫరా చేయాలని గోడౌన్ ఇన్‌చార్జ్‌కు సూచించారు. తనిఖీ చేసిన వారిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ ఆర్‌వీఎస్ కృష్ణమోహన్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఊతకోలు శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది ఉన్నారు.

పశు సంచార వాహనంలో డ్రైవర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

● 70 మంది అభ్యర్థులు హాజరు



అభ్యర్థుల వివరాలు పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

ఒంగోలు సెంట్రల్: పశు సంచార వాహనంలో డ్రైవర్ పోస్టులకు శుక్రవారం ఒంగోలులో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలో పాల్గొన్న అభ్యర్థులకు పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి నియమ నిబంధనలు వివరించారు. సంస్థ నుంచి వచ్చే పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను తెలియజేశారు. ఎంపికైన అభ్యర్థుల అంబులెన్స్ డ్రైవింగ్‌ను పరిశీలించిన తర్వాత సంస్థలో చేర్చుకుంటామని స్పష్టం చేశారు. ఇంటర్వ్యూకు 70 మంది హాజరయ్యారు. ఈఎంఆర్ఐజీహెచ్‌ఎస్ ప్రోగ్రాం మేనేజర్ రామలింగేశ్వరరావు, జిల్లా మేనేజర్ నెమలి శివశంకర్ పాల్గొన్నారు.

సనాతన ధర్మం కోసం కాశ్మీర్ టు కన్యాకుమారి

● జాతీయ ప్రచారక్ చాంపియన్ పాదయాత్ర



శివకరణ్‌కు స్వాగతం పలుకుతున్న ఆధ్యాత్మికవేత్తలు



జాతీయ జెండాతో పాదయాత్రలో శివకరణ్

కొనకనమిట్ల: దేశంలో ప్రజల జీవన విధానం, స్థితిగతులు, సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవటంతో పాటు సనాతన ధర్మం కోసం, అమర వీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ఉత్తరప్రదేశ్‌కు చెందిన జాతీయ ప్రచారక్ పేట్రియాట్ చీఫ్ ఆఫ్ చాంపియన్ శివసేనక్ శివకరణ్ పాదయాత్ర చేస్తున్నాడు. శ్రీశైలం, తిరుపతి వెళ్తున్న క్రమంలో శుక్రవారం సాయంత్రం కొనకనమిట్ల సమీపంలో కాసేపు ప్రజలతో ముచ్చటించారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదరక్షలు ధరించకుండా పాదయాత్ర చేస్తున్న ఆయన శుక్రవారం ఉదయం పొదిలి పట్టణంలోని నిర్మామహేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. శివకరణ్‌ను పొదిలి ఆర్యవైశ్య సంఘం ఆధ్యాత్మికవేత్తలు కలిసి స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం శివకరణ్ తన పాదయాత్ర కొనసాగించారు.